క్లుప్తంగా

ఘనంగా ఫొటోగ్రాఫర్స్ డే



ఫొటోగ్రఫీ దినోత్సవంలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

సాలూరు: పట్టణంలో ఫొటోగ్రాఫర్స్ డే ను శనివారం ఘనంగా నిర్వహించారు. సాలూరు ఫొటోగ్రాఫర్ యూనియన్ ప్రెసిడెంట్ జయరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. పలువురు రోగులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు.

మత్స్యకార సొసైటీ ఎన్నిక ఏకగ్రీవం



ఎన్నికైన నూతన కార్యవర్గం

పార్వతీపురం టౌన్: సొసైటీ ఎన్నికల అధికారి ఆర్.శేషమ్మ ఆధ్వర్యంలో స్థానిక ఐఎఫ్‌సీఎస్ భవనంలో శనివారం నిర్వహించిన మత్స్యకార సొసైటీ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ ఎన్నికలో 9మంది అభ్యర్థులు డైరెక్టర్లుగా నామినేషన్ వేయగా అందరూ ఏకగ్రీవమయ్యారు. ఎన్నికైన సొసైటీ నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా మురుముల్ల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడిగా బెహర అప్పారావు, డైరెక్టర్లుగా సింగిడి రాము, బి.శ్రీను, పొండ్రంకి కామరాజు, రాజాపు సింహాచలం, ఎస్.గణేష్, జి.లక్ష్మణ రావు, బెహరా సీతారాలను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు 129మంది సంఘం సభ్యులు హాజరయ్యారు. కార్యక్రమంలో గ్రామ మత్స్య సహాయ కులు కోట శంకరరావు, మారోతు సరళ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మద్దతుదారు గెలుపు



ఎన్నికల అధికారి నుంచి ధ్రువపత్రం అందుకుంటున్న రెయ్యి సీతాలక్ష్మి

పాచిపెంట: మండలంలోని పణుకువలస పంచాయతీ ఏడో వార్డు సభ్యుడి ఎన్నిక శనివారం జరగగా, వైఎస్సార్‌సీపీ మద్దతుదారు రెయ్యి సీతాలక్ష్మి 111 ఓట్ల తేడాతో విజయం సాధించింది. మొత్తం 196 ఓట్లకు గాను 153 ఓట్లు పోలవ్వగా టీడీపీ బలపరిచిన అభ్యర్థి సుగుట శకుంతలకు కేవలం 19 ఓట్లు రాగా, సీతాలక్ష్మికి 130 ఓట్లు వచ్చాయి. నాలుగు ఓట్లు చెల్లలేదు. ఎన్నికల అధికారులు రెయ్యి సీతాలక్ష్మికి ధ్రువీకరణ పత్రం అందజేయగా.. సర్పంచ్ చెల్లూరి సీతారాం, మండల నాయకులు అభినందించారు.

పాఠశాల సందర్శన



తరగతి గదిలో డీఈఓ ప్రేమ్‌కుమార్

మక్కువ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను డీఈఓ ప్రేమ్‌కుమార్ శనివారం సందర్శించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన ఐఎఫ్‌పీలను వినియోగంలోకి తీసుకురావాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ.. సిలబస్ ఎంతవరకు పూర్తయింది, మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అలాగే ఉపాధ్యాయులతో సమావేశమై, శతశాతం ఉత్తీర్ణత సాధించేలా పక్కా ప్రణాళికలతో బోధన చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఈఓలు సత్యనారాయణ, శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల వారికి ప్రభుత్వ సహకారం



పనుకువలసలో ఫిష్ ఆంధ్రా షాపును ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: అన్ని వర్గాల వారిని ఆదుకునేందుకు జగనన్న ప్రభుత్వం సహకరిస్తుందని పనుకువలస సర్పంచ్ కోట మంజుభార్గవి అన్నారు. గ్రామ సమీపంలో జెజ్జీ గ్రామానికి చెందిన మత్స్యకారుడు జనార్దనరావుకు మంజూరైన ఫిష్ ఆంధ్రా షాపును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణుల అభ్యున్నతికి సర్కారు చేపడుతున్న సంక్షేమం, అభివృద్ధి పథకాలపై వివరించారు. అర్హులు వాటిని సద్వినియోగపర్చుకుని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో బెజ్జి సర్పంచ్ శివ్వాల శ్రీనివాసరావు, ఎంపీటీసీ కోట అజయ్‌కుమార్, కె.జనార్దనరావు, పాసినపల్లి ముకుందరావు తదితరులు పాల్గొన్నారు.

మాటిచ్చి అమలు చేశాం

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ప్రతిపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ప్రజల కష్టాలను గుర్తించి ఇచ్చిన మాట ప్రకారం, ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తరువాత ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేశారు. ఈ క్రమంలో ఈరోజు ప్రజలలోకి వచ్చి చేసింది ధైరంగా చెప్పి తిరిగి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ సీఎంగా చేయాలని ప్రజలను అడుగుతున్నామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. బలిజిపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో గడగడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని వివరించి బుక్‌లెట్‌లు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను 4సంవత్సరాలలోనే నెరవేర్చి ప్రజల ముందుకు వెళ్లి అర్హతే ప్రామాణికంగా ఈ పథకం వర్తించిందని, అందిందా? లేదా? అని ధైర్యంగా ప్రజలను అడుగుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఉత్సాహంతో ముందుకు సాగిస్తున్నామన్నారు. ఇచ్చిన హామీ నెరవేరిందా? లేదా? అని ఎన్నికల ముందు ప్రజలను ధైర్యంగా అడిగి రానున్న ఎన్నికల్లో మేలు చేసే నాయకుడికి ఓటువేయాలని కోరారు. అర్హత ఉన్న అన్ని వర్గాలవారికి సంక్షేమ ఫలాలు అందించాలని అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ రాఘలత, ఏఓ భానుమూర్తి, ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, బలిజి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, పలగర సహకార సంఘం అధ్యక్షుడు జి.పకీరునాయుడు, బలిజిపేట ఉపసర్పంచ్ శ్రీనివాసరావు, వ్యవసాయ సలహా సంఘం మండల అధ్యక్షుడు గంగయ్య, జ్యోతీష్, మండల మహిళాసంఘం అధ్యక్షురాలు ఎం.దుర్గేశ్వరి, సర్పంచ్ ఆర్.శ్రీనివాసరావు, ఎంపీటీసీ మల్లిక, జి.సత్యంనాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



బలిజిపేటలో లబ్ధిదారుకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



వినతిపత్రం అందజేస్తున్న, ఫొటో, వీడియోగ్రాఫర్లు

ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి

పార్వతీపురంటౌన్:ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు ప్రపంచ ఛాయచిత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఏపీఎన్‌జీఓ భవనంలో శనివారం జిల్లా పరిధిలో గల ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఫొటో, వీడియో గ్రాఫర్లందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఫొటో, వీడియోగ్రాఫర్లు వారి సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, సభ్యులతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా గల ఫొటో, వీడియో గ్రాఫర్లు పాల్గొన్నారు.

రాహదారి నిర్మాణానికి శంకుస్థాపన

గిరిశిఖర గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని ఎమ్మెల్యే జోగారావు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలో డీకే పట్టణం పంచాయతీ, బొడ్డవలస గిరిజన గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిపై 850 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టిన సమయంలో ఈ గ్రామ ప్రజలకు హామీ ఇచ్చిన మేరకు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకువెళ్లగా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో పీఆర్ ప్రాజెక్ట్స్ డీఈఈ, ఏఈ, వైఎస్సార్ సీపీ మండల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు స్థానిక ప్రజలు, కాంట్రాక్టర్లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయండి

- ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

సాలూరు: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సాలూరు, పాచిపెంట మండలాల ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గడప గడపకు... కార్యక్రమంలో మంజూరైన పనులు, వాటి ప్రగతిపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మంజూరైన పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. చేపట్టిన పనులకు బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. బిల్లుల చెల్లింపులు సక్రమంగా జరుగుతున్నాయని.. నిర్మాణాలు పూర్తయిన ప్రభుత్వ భవనాలను వెంటనే అప్పగించాలని ఆదేశించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్, పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ విష్ణుచరణ్

వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

పార్వతీపురంటౌన్: వార్డు వలంటీర్స్ నోటిఫికేషన్‌లో భాగంగా మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రామప్పలనాయుడు ఆధ్వర్యంలో శనివారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. 13 పోస్టులకు గాను 77 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా ఇంటర్వ్యూకు 59 మంది హాజరయ్యారు. వారిలో ప్రతిభ కనబరిచిన 13 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐలు వినయ్, నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వ లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు సూచించారు. ఈ మేరకు గ్రూప్ 1, గ్రూప్ 2, కానిస్టేబుల్ పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారికోసం ప్రత్యేకంగా మున్సిపాలిటీ నిధులతో చర్చివీధిలో గల పురపాలక గ్రంథాలయంలో కొత్త పోటీ పరీక్ష పుస్తకాలను శనివారం ఆయన ఆవిష్కరించారు. పార్వతీపురం పట్టణంలో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కమిషనర్ సూచించారు. కార్యక్రమంలో పురపాలక గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.



వలంటీర్లకు నియామక పత్రాలు అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం చారిత్రాత్మకం



ఏపీఎన్‌జీఓ సంఘం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్‌స్ కిశోర్

పార్వతీపురంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం చారిత్రాత్మక నిర్ణయమని ఏపీఎన్‌జీఓ సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షుడు జీవీఆర్ స్ కిశోర్ అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక ఎన్‌జీఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రెగ్యులర్ చేసి కాంట్రాక్ట్ ఉద్యోగులకు మేలు చేశారన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులు గత 20 ఏళ్ల నుంచి రెగ్యులర్ కోసం ఎదురు చూశారని, ఎట్టకేలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కృషి ఫలితంగా వారి జీవితాల్లో వెలుగులు నిండాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న 3,396 మంది కాంట్రాక్టు ఉద్యోగులు రెగ్యులర్ కానున్నారని, తామంతా సీఎం రుణం ఎప్పటికీ తీర్చుకోలేమని కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎన్నిక ఏదైనా వైఎస్సార్‌సీపీదే విజయం

- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ఏ ఎన్నికలైనా వైఎస్సార్‌సీపీ విజయం ఖాయమని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పాచిపెంట మండలం పణుకువలస పంచాయతీ ఏడో వార్డు సభ్యుడి ఎన్నిక శనివారం నిర్వహించారు. ఈ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన రెయ్యి సీతాలక్ష్మి విజయం సాధించింది. ఈ మేరకు సీతాలక్ష్మి, ప్రజాప్రతినిధులు సాలూరు పట్టణంలో మంత్రి పీడిక రాజన్నదొరను కలిశారు. ఈ సందర్భంగా రాజన్నదొర మాట్లాడుతూ, సాధారణంగా ఎవరైనా ప్రజాప్రతినిధి చనిపోతే అక్కడ ఆ పార్టీకి చెందిన కుటుంబ సభ్యుడ్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అయితే టీడీపీ నాయకులు ఆ విధానానికి స్వస్తి పలికి టీడీపీ తరపున అభ్యర్థిని బరిలోకి దించారన్నారు. ఈ ఎన్నికలో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతాలక్ష్మికి 130 ఓట్లు పోలవ్వగా.. టీడీపీ మద్దతుదారుకి కేవలం 19 ఓట్లు మాత్రమే వచ్చాయన్నారు. త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

పంటల నమోదుకు సహకరించాలి

పాలకొండ రూరల్: రైతులు పంటల వివరాలను నమోదు చేసుకునేందుకు పూర్తి సహకారం అందించాలని వ్యవసాయాధికారిణి ఎన్ని వాహిని కోరారు. మండలంలోని లుంబూరు ఆర్‌బీకేను శనివారం ఆమె సందర్శించారు. రైతులకు అందించిన ఎరువు ల వివరాలపై ఆరా తీసారు. రికార్డులు పరిశీలించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ప్రస్తుత సీజన్‌లో వారు పండిస్తున్న పంటల వివరాలను నమోదు చేయించుకోవటం వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ విధా నం వలన పంటల బీమా, ధాన్యం కొనుగోలు, రైతు భరోసా వర్తింపుకు అవకాశం ఉంటుందన్నా రు. పంటలు నమోదు చేసే క్రమంలో రైతులు వారి ఆధార్, 1-బీ అడంగల్, బ్యాంక్ అకౌంట్, పాస్ ఫొటో అందించాలని, కచ్చితంగా ప్రతి రైతు సహకరించాలన్నారు.

4వ వార్డులో సీతారాం గెలుపు

జియ్యమ్మవలస: మండలంలోని కొండచిలకాంలో 4వ వార్డుకు శనివారం జరిగిన ఉప ఎన్నికలో మెల్లక సీతారాం విజయం సాధించారు. సీతారాంకు 64 ఓట్లు రాగా ప్రత్యర్థి రవికి 33 ఓట్లు పోలైనట్లు ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు తెలిపారు. మొత్తం 131 ఓట్లకుగాను 97 ఓట్లు పోలైనట్టు తెలిపారు. సీతా రాం 31 ఓట్లతో గెలుపొందినట్టు వెల్లడించారు.

వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి



పార్వతీపురం మండలంలో పరి సాగుపై అవగాహన కల్పిస్తున్న అధికారులు



మండలంలో శాస్త్రీయ పద్ధతిలో వరిసాగు

- ఏఓ అశోక్


పార్వతీపురంటౌన్: వరి సాగు చేసే రైతులు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి. వారి సూచనల మేరకు పరిమితంగా ఎరువులు వాడాలి. పరిమితికి మించి వాడినా, రసాయనిక ఎరువులు వాడినా ఆ ప్రభావం కచ్చితంగా పంట దిగుబడిపై పడుతుందని పార్వతీపురం మండల వ్యవసాయ అధికారి అశోక్ అంటున్నారు. ప్రస్తుతం మండల వ్యాప్తంగా సుమారు 85 శాతం మేర నాట్లు పూర్తయ్యాయి. పంట వేసి 50 రోజులు కావస్తోంది. ఈ దశలో ఎలాంటి చర్యలు తీసుకోవాలో ఆయన తెలియజేశారు.

కాంప్లెక్స్ ఎరువులు వద్దు...

ప్రస్తుత దశలో ఎలాంటి కాంప్లెక్స్ ఎరువులను ఉపయోగించరాదు. వాటిని దమ్ము సమయంలో మాత్రమే వేసుకోవాలి. దమ్ము సమయంలో ఎకరం విస్తీర్ణానికి 100 కిలోల సూపర్, 15 నుంచి 20కిలోల వేప యూరియా, 15 నుంచి 20 కిలోల పొటాష్ వేసుకోవాలి. ప్రస్తుత సమయంలో 20 నుంచి 30 రోజులు దాటిన పొలానికి ఎకరం విస్తీర్ణానికి 20 కిలోల యూరియాను వేసుకుంటే సరిపోతుంది. 55 నుంచి 60 రోజుల పొలానికి అంటే పాలు పోసుకునే దశలో 20 కిలోల యూరియా వేసుకోవాలి. కాంప్లెక్స్ ఎరువులు వాడితే బాస్వరం మొక్కకు అందక పోగా నేలసారాన్ని దెబ్బతీస్తుంది. అందుచేత పైపై ఎరువులు కాకుండా సూటి ఎరువులు మాత్రమే వేసుకోవాలి.

తెగులు నివారణ ఇలా..

చేనుకు ఆకుముడత, కాండం తొలిచే పురుగు ఆశిస్తే ప్రొఫినోఫాస్ 2 ఎంఎల్‌ను ఒక లీటరు నీటిలో, అసిఫైట్ 1.5 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కలుపు మొక్కలు అధికంగా ఉంటే అధికారుల సూచనల మేరకు సంబంధిత మందును పిచికారీ చేయాలి. ప్రస్తుతం చాలా భూముల్లో కలుపు తక్కువగానే ఉంది. దీంతో రైతులు మందులపై కాకుండా కలుపు నివారణకు వ్యవసాయ కూలీలను ఉపయోగించవచ్చు. దీని వల్ల చేలలో మొక్కల మొదలు (కుదురు) కదలిక వల్ల మొక్క మరింత ఏపుగా పెరిగేందుకు దోహదపడుతుంది.



క్రిమి సంహారక మందులు పిచికారీ చేస్తున్న రైతు

రైతులకు నానో యూరియా ద్రావణం పంపిణీ



నానో యూరియాను రైతులకు పంపిణీ చేస్తున్న ఏఓ ఎస్ అవినాష్

సీతానగరం: వరిచేను ఇతర పంటలకు అవసరమైన ఎరువుల వాడకంలో భాగంగా నూతనంగా వచ్చిన నానో యూరియా ద్రావణాన్ని రైతులు స్ప్రే రూపంలో వేయాలని ఏఓ ఓస్‌అవినాష్ సూచించారు. ఈ మేరకు శనివారం ఆయన మండలంలోని జానుమల్లువలస, దయానిధిపురం, కె సీతారాంపురం, అంటిపేట, పణుకుపేట గ్రామాల్లో వరిసాగు చేసిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జానుమల్లువలసలో మాట్లాడుతూ ఎరువుల వాడకంలో రైతులు మెలకువలు పాటించాలని, తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితం వచ్చే ఎరువులను ఎంపిక చేసుకోవాలని హితవు పలికారు. ఇంతవరకూ గుళికల రూపంలో యూరియా లభ్యమయ్యేదని యూరియా కొరత కారణంగా ఎరువుల తయారీ కంపెనీలు తాజాగా ద్రావణం రూపంలో నానో పేరుతో యూరియా తయారుచేసినట్లు చెప్పారు. 30 కేజీల గుళికల యూరియా(బస్తా) 1/2 లీటరు నానో యూరియా (లిక్విడ్)ద్రావణంతో సమానమని అన్నారు. అనంతరం రైతులకు నానో యూరియా ద్రావణాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో జానుమల్లువలస మాజీ సర్పంచ్ వై జగన్నాథం నాయుడు, వ్యవసాయ సహాయకులు రైతులు పాల్గొన్నారు.

జోగింపేటలో దోమలనివారణ



జోగింపేటలో దోమలనివారణమందు పిచికారీ చేయిస్తున్న సర్పంచ్ కె.సింహాచలం

సీతానగరం: వర్షాలు కురుస్తున్న కారణంగా ఉన్నతాధికారుల సూచనల మేరకు మండలంలోని పలుగ్రామాల్లో శనివారం గ్రామ సర్పంచ్‌ల పర్యవేక్షణలో కార్యదర్శులు పారిశుద్ధ్య పనులు నిర్వహించడంతో పాటు దోమల నివారణకు మందు పిచికారీ చేయించారు. ఈ మేరకు జోగింపేట పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జోగింపేట పంచాయతీలోని రెండు గ్రామాల్లో సర్పంచ్ కె.సింహాచలం ఆధ్వర్యంలో పూడికలు, చెత్తకుప్పలను తొలగించి, కాలువల్లో దోమల నివారణకు మలాథియాన్ ద్రావణాన్ని పిచికారీ చేయించామని తెలియజేశారు. రంగంపేట పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ సర్పంచ్ బి.భాస్కర రావు ఆధ్వర్యంలో గ్రామంలో పారిశుద్ధ్య పనులు నిర్వహించి కాలువల్లో పేరుకు పోయిన చెత్తను దూరప్రాంతాలకు తరలిచినట్లు చెప్పారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించాలి



డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న ఎస్సై పాపారావు

పార్వతీపురంటౌన్: వాహనచోదకులు తప్పకుండా నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ఎస్సై పాపారావు అన్నారు. ఈ మేరకు శనివారం నోయాక్సిడెంట్ డే సందర్భంగా ట్రాఫిక్‌పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులకు ఆయన కౌన్సెలింగ్ చేశారు. అంతరం డ్రంకెన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని హితవు పలికారు. ఆటోడ్రైవర్లు అన్ని ధ్రువపత్రాలను కలిగి ఉండడంతో పాటు ఇన్సూరెన్స్ కలిగి ఉండాలన్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కిస్తే జరిమానాతో పాటు ఆటోను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది కిశోర్, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

రాజీయే రాజమార్గం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా రెండవ అదనపు జడ్జి ఎస్.దామోదర రావు

- సెప్టెంబరు 9న జిల్లాకేంద్రంలో జాతీయ లోక్‌అదాలత్
- రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదర రావు

పార్వతీపురంటౌన్: వచ్చే నెల 9వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా రెండవ అదనపు జడ్జి, మండల లీగల్ సెల్ కమిటీ చైర్మన్ ఎస్.దామోదర రావు తెలిపారు. రాజీ మార్గం ద్వారా ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పార్వతీపురం కోర్టు భవనంలో పోలీస్ అధికారులు, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు, సంబంధిత శాఖల అధికారులతో జాతీయ లోక్ అదాలత్ పై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లిటిగేషన్ కేసులు తక్కువగా ఉన్న చోట ప్రజల జీవన ప్రమాణాలు మెరుగ్గా ఉంటాయన్నారు. పోలీస్‌స్టేషన్లు, శాఖల వారీగా కేసులను గుర్తించి సామరస్యంగా పరిష్కరించినట్లయితే ప్రశాంతంగా జీవించే అవకాశం కల్పించిన వారవుతారన్నారు. ఎక్కువ పెండింగ్ కేసులు ఉన్న చోట అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కక్షిదారులు డబ్బు, సమయాన్ని వృథా చేయకుండా లోక్ అదాలత్ ముందుకువచ్చి రాజీపడి కేసులను పరిష్కరించుకుని, ప్రశాంతంగా జీవించాలని హితవు పలికారు. లోక్ ఆదాలత్ ద్వారా కేసులు సత్వరమే పరిష్కారమ వుతాయన్నారు. లోక్ అదాలత్ ఆవశ్యకతను సోషల్ వర్కర్లు వివరించాలని సూచించారు. రైతులు కష్టపడి పంట పండిస్తేనే ఆహారం లభిస్తుందని, వారిపట్ల ఉదారత చూపించి విరివిగా రుణాలు అందజేయాలని బ్యాంకర్లకు సూచించారు. పోలీస్, బ్యాంకు అధికారులను పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి యజ్ఞ నారాయణ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎ.రమేష్, అడిషనల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ డి.సౌజన్య, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ఎం.రవిశంకర్ ప్రసాద్, ఎల్‌డీఎం జేఎల్‌ఎస్ మూర్తి, ఎస్సైలు ఎస్.షణ్ముఖరావు, ఎం.జగదీష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు సహకరించాలి



హనుమాన్ జంక్షన్ వద్ద వాహన చోదకులతో మాట్లాడుతున్న ఎస్సై కె.నీలకంఠం

సీతానగరం: మండలంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో, ద్విచక్ర, ఇతర వాహన చోదకులు సహకరించాలని ఎస్సై కె.నీలకంఠం కోరారు. ఈ మేరకు శనివారం సాయంత్రం రాష్ట్ర రహదారిపై చినభోగిలి బస్టాప్, సీతానగరంలోని హనుమాన్ జంక్షన్‌లో వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతికూడలి వద్ద తమ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారన్నారు.

వాహనాలు నడిపే సమయంలో వేగాన్ని నియంత్రించి ఇతర వాహనాల రాకపోకలను గుర్తించి నడపాలని కోరారు. వాహనాలు నడిపే సమయంలో పోలీసువారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులను పరిశీలించి నిబంధనలు పాటించాలని, వాహనాలకు సంబధించిన రికార్డులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని హితవు పలికారు. డ్రైవింగ్‌లో అనుభవం లేని వారికి, చిన్నపిల్లలకు వాహనాలను ఇవ్వరాదని అన్నారు. గతంలో వాహలనాపై విధించిన పాత బకాయిలను ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పార్వతీపురం / సాలూరు
9010204441, 9951602891
Office mail : vzmadvt@gmail.com